

ఆదర్శప్రాయుడు చాచా నెహ్రూ

● బాలల దినోత్సవంలో సీఎం సిద్దరామయ్య



నెహ్రూ చిత్రపటానికి సీఎం పుష్పాంజలి

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆదర్శప్రాయుడని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని అందుకే చాచా నెహ్రూగా పిలుస్తారని ఆయన జన్మదినం బాలల దినోత్సవంగా జరుపుకొనే సంప్రదాయం దశాబ్దాలకాలంగా సాగుతోందన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని విధానసౌధలోని నెహ్రూ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. బ్యాంక్వెట్‌హాల్‌లో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్ చిన్నారులతో ముచ్చటించారు. విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కేపీసీసీలోనూ నెహ్రూకు నివాళులు అర్పించారు.



డీసీఎం డీకే శివకుమార్ నివాళి

కొవిడ్ అక్రమాలపై సిట్‌తో దర్యాప్తు

● మైఖేల్ కున్హా కమిటీ సిపారసుల అమలుకు ప్రభుత్వం నిర్ణయం ● సీబీఐ తిరస్కరించిన గనుల అక్రమాలపైనా విచారణ ● కేబినెట్‌లో కీలక తీర్మానం

బెంగళూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కొవిడ్ అక్రమాలపై రిటైర్డు న్యాయమూర్తి జాన్ మైఖేల్ కున్హా నేతృత్వంలోని కమిటీ నివేదికలోని సిఫారసులను అమలు చేసేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్ తీర్మానాలను న్యాయ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కొవిడ్ అక్రమాలపై న్యాయమూర్తి జాన్ మైఖేల్ కున్హా నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. కమిషన్ రెండు మధ్యంతర నివేదికలలో భారీ అవినీతి చోటు చేసుకుందని ప్రజల జీవితాలతో చెలగాటం ఆడారని, అమానుషమైన సంఘటనలు చోటు చేసుకున్నాయని పొందుపరిచిందన్నారు. అందుకు అనుగుణంగా సిట్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానించామన్నారు. పీపీఈ కిట్ కొనుగోలుతోపాటు ప్రతి విషయంలోనూ అవినీతి చోటు చేసుకుందన్నారు. అన్ని అంశాలపైనా దర్యాప్తు జరిపి ఎఫ్ఐఆర్ చార్జ్‌షీట్‌లు నమోదు చేసి నిందితులను గుర్తించి సమగ్రంగా శిక్ష విధించి రాష్ట్ర ప్రజలకు న్యాయం కల్పించాలని తీర్మానించామన్నారు. ఇక సీబీఐ స్వీకరించిన గనుల అక్రమాల వివాదంలో 6 కేసులలో దర్యాప్తు కొనసాగించలేమని తెలిపిందన్నారు. వాటిని తీవ్రంగా పరిగణిస్తున్నామని దర్యాప్తు జరిపేందుకు మంత్రివర్గం తీర్మానించిందన్నారు. గోవాలోని మర్మగోవా, పానాజి, తమిళనాడులోని ఎన్నూరు చెన్నై, కర్ణాటకలోని నవమంగళూరు, కారవార ఓడరేవులు, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం, కాకినాడ, విశాఖపట్నం ఓడరేవులలో అక్రమంగా ముడిఖనిజం ఎగుమతికి సంబంధించిన కేసులను సీబీఐ వాపసు పంపిదన్నారు. వాటిని సిట్ ద్వారా విచారణ జరిపించదలిచామన్నారు. రాష్ట్ర ఖజానాకు నష్టం కలిగేలా సి గ్రూప్‌కు చెందిన పది గనుల కంట్రాక్టు సంస్థల అక్రమాలను విచారించేందుకు సిట్ ఏర్పాటు చేశామన్నారు. వీటిలో మైసూరు మాంగనీస్ కంపెనీ, దశరథరామిరెడ్డి గనుల కంపెనీ, అల్లం వీరభద్రప్ప కంపెనీ, కర్ణాటక లింఫో కంపెనీ, అంజనా మినరల్స్, రజియాఖానుం కంపెనీ, మిలన మినరల్స్, ఎం శ్రీనివాసులు కంపెనీ, చన్నకేశవరెడ్డి, రాజశేఖర్ కంపెనీలకు మంజూరు చేసిన భూమికంటే ఎక్కువగా తవ్వకాలు జరిపినట్టు ప్రాథమికంగా గుర్తించిన మేరకు లోకాయుక్త ప్రత్యేక బృందం ద్వారా విచారణలు జరిపేలా తీర్మానించామన్నారు.



మీడియాతో మంత్రి హెచ్‌కే పాటిల్

బడి స్థలం భద్రం..!



● ప్రభుత్వ పాఠశాలల ఆక్రమణలపై కదిలిన సర్కార్ ● ఏడాదిలోగా ప్రత్యేక ఖాతాలు
● రాష్ట్రంలో 43,564 ప్రాథమిక, 4,729 హైస్కూళ్లు ● 20 వేల రిజిస్ట్రేషన్ పెండింగ్



బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో కర్ణాటక ముందంజలో ఉంది. ఒకప్పుడు బెంగళూరుకే పరిమితమైన ప్రగతి ఇటీవల తీరప్రాంత, ఉత్తర కర్ణాటక, మైసూరు ప్రాంతంతోపాటు తుమకూరు, చిక్కబళ్లాపుర జిల్లాల్లోనూ భారీ పరిశ్రమలతోపాటు వైద్యవిద్య కళాశాలలు, యూనివర్సిటీలు ఏర్పడుతున్నాయి. ఇలా సమగ్రమైన విభాగాల్లో జిల్లాల పరిధిలో ఏర్పాటు అవుతుండడంతో సదరు ప్రాంతాల్లోనూ పురోగతి పరుగులు పెడుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీంతో భూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. రెండు మూడేళ్లుగా కబ్జాల కేసులు భారీఅ నమోదవుతున్నాయి. మరోవైపు తరతరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్న భూములు, మఠాలు, వాటికి అనుబంధమైన విద్యాసంస్థలే కాకుండా ఏకంగా బీదర్ కోట సైతం వక్ఫ్ భూమిగా నమోదైన అంశం సంచలనమైంది. కొన్నేళ్ల క్రితం పాఠశాలలకు ఉచితంగా భూమిని ఇచ్చేందుకు దాతలు విరివిగా ముందుకొచ్చేవారు. అయితే ఇటీవల ఆ పరిస్థితి కనిపించడం లేదు. భూముల ధరలు పెరగడం, గ్రామాల సమీపంలో పరిశ్రమలు స్థాపించడం, లే అవుట్‌లు వెలుస్తుండంతో వ్యవసాయ అనుబంధమైన పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు కల్పిస్తున్నాయి. దీంతో గ్రామాలకు సమీపంలోనూ, రోడ్లకు అనుబంధంగా ఉండే భూమిని విద్యాసంస్థల ఏర్పాటుకు ఎవరూ ఉచితంగా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీనికితోడు దాదాపు అన్ని గ్రామాల్లోనూ పాఠశాలలు ఏర్పడి దశాబ్దాల కాలమవుతోంది. గతంలో ఇచ్చిన భూములకూ గడ్డు పరిస్థితి ఏర్పడుతోంది. బినామీ రికార్డులతో పాఠశాల స్థలం మాదంటూ కొందరు పుట్టుకొస్తున్నారు. కొన్నేళ్లక్రితమే కొనుగోలు చేశామని మెలికలు పెడుతున్నారు. దీంతో విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా ఉండే ప్రభుత్వ పాఠశాల భూముల ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించాలని తీర్మానించింది. ఈ ఏడాది ఆఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ జిల్లా స్థాయి అధికారులను ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల ఆస్తుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. అన్ని పాఠశాలలకు ఖాతాలను సిద్ధం చేయాలని పాఠశాల ఆస్తుల సంరక్షణ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలు పెరుగుతున్న తరుణంలో విద్యాశాఖ ఆస్తుల సంరక్షణకోసం చర్యలకు సిద్ధమైంది. వాస్తవానికి రెండేళ్లనుంచి ప్రభుత్వ పాఠశాలల ఆస్తుల సంరక్షణకై త్రైమాసిక సమీక్షలు కొనసాగాయి. అయితే పలు జిల్లాల్లో సమస్యలు ఉండడంతో సమగ్రంగా పూర్తి చేయలేకపోయారు.

పెండింగ్‌లో రిజిస్ట్రేషన్

రాష్ట్రంలో 43,564 ప్రాథమిక, 4,729 హైస్కూళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు 60శాతం పాఠశాలకు అనుబంధమైన స్థలాలను రిజిస్ట్రేషన్ చేశారు. సుమారు 20 వేల పాఠశాలల ఆస్తుల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన 40శాతం డిసెంబరులోగా పూర్తి చేయాలని తీర్మానించారు. దీంతో 2025 జనవరి నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల భూములకు రికార్డులు విద్యాశాఖ అధీనంలో ఉండాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు.

మూతబడిన, విలీనమైన లేదా ఇతర ప్రాంతాలకు మార్పు చేసిన పాఠశాల ఆస్తులు ఆక్రమణలు కాకుండా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ కమిషనర్ బీబీ కావేరి రెవెన్యూశాఖ, జిల్లా అధికారులకు ప్రత్యేకంగా లేఖలు రాశారు. కొన్నేళ్లుగా పాఠశాల కొనసాగి ఇటీవల నిరుపయోగంగా ఉంటే సదరు స్థలంలో విద్యాశాఖకు అనుబంధమైన సంస్థల ఏర్పాటుకు అధికారులు సహకరించాలని లేఖలో ప్రస్తావించారు. పాఠశాల ఆస్తులను సంరక్షించి జిల్లాస్థాయి ఫిజికల్ డైరెక్టర్‌ను నోడల్ ఆఫీసర్‌గాను, తాలూకా స్థాయి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)లను తాలూకా స్థాయి నోడల్ పర్యవేక్షకులుగా నియమించారు. డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో పాఠశాల ఆస్తుల సంరక్షణ చేపట్టాలని సూచించారు. మరో నెలన్నర కాలంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆస్తులన్నింటికీ రికార్డులు సిద్ధం చేయాలని నిర్ణయించారు. దీంతో బడి ఆస్తులు భద్రంగా ఉంటాయని భావిస్తున్నారు.

ఎన్నెన్నో సమస్యలు

ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమితోపాటు ఎంతోమంది దాతలు, విద్యాభిమానులు తమ గ్రామాలు, పట్టణాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటు చేస్తే ఉచితంగా భూమిని ఇచ్చారు. ఈ విధానం రాష్ట్రంలోనే కాకుండా దేశమంతటా కొనసాగింది. అయితే ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన భూమిలో నివాస స్థలాలు, ఇతరుల పేరిట నమోదై ఉండడం వంటి వివాదాలు తెరపైకి వస్తున్నాయి. ఇలా ప్రభుత్వ పాఠశాలల ఆస్తులు ఇతరుల పాలవుతున్నాయి. ఒకప్పుడు పాఠశాల ఏర్పాటుకు దానమిచ్చిన భూమికి సంబంధించి రెండో తరం లేదా మూడో తరానికి చెందినవారు పూర్వీకులు ఇచ్చిన భూమి వాపసు ఇవ్వాలని జిల్లా అధికారులకు వినతులు ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి. మరికొందరు కోర్టులను ఆశ్రయించారు. తమ పూర్వీకులు కోట్లాదిరూపాయల విలువైన భూమిని ఉచితంగా ఇస్తే పాఠశాలలో జరిగే కార్యక్రమాలకు కనీసం తమకు సమాచారం ఇవ్వడం లేదని మెలికలు పెట్టేవారు పెరిగిపోయారు. మరోవైపు రాజకీయంగాను ఇతర పార్టీలకు చెందినవారు ప్రాబల్యం ఉంటే తమ భూమి ఎందుకు ఇవ్వాలని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా దశాబ్దాలక్రితం ఇచ్చినభూములు తమకు చెందినవంటూ వారు అభ్యంతరం తెలిపేందుకు ప్రధాన కారణం ఇప్పటికీ సదరు భూములు వారి పేరున ఉండడమేనని తెలుస్తోంది. జిల్లా అధికారులకు ఇటీవల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల స్థలం ఆక్రమణలో ఉంటే తొలగించి శాశ్వతంగా సంరక్షించేలా సహకరించాలని కోరారు.

మృత్యుఘోష

● బళ్లారి గోషాసుపత్రిలో మరో బాలింత మృతి
● మూడుకు చేరిన మృతుల సంఖ్య
● మరో ఇద్దరి పరిస్థితి విషమమే ...
● విచారణకు త్రిసభ్య కమిటీ రాక




బళ్లారి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :బళ్లారి గోషాషుపత్రిలో బాలింతల మృత్యుఘోష ఆగడం లేదు. గురువారం మరో బాలింత రోజా (19) కన్ను మూసింది. కంప్లి తాలుకా ఎమ్మిగనూరు గ్రామానికి చెందిన రోజా ఆదివారం జిల్లా ప్రభుత్వాస్పత్రికి కాన్పుకు వచ్చింది. కాన్పు తరువాత ఆమె పరిస్థితి విషమించడంతో విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆమె గురువారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రెండు రోజుల క్రితమే నందిని, లలిత అనే బాలింతలు మృతి చెందిన సంగతి తెలిసిందే. గురువారం బాలింత మృతితో మృతుల సంఖ్య మూడుకు చేరింది. గోషసుపత్రి కాన్పుల గదిలో హెచ్‌బీఎస్ఏజీ (హెపటైటిస్ బీ) వైరల్ వ్యాధి సోకడంతో బాలింత ఆరోగ్య పరిస్థితి విషమించింది. బాలింతల మృతిపై బెంగళూరు నుంచి విచారణ బృందం గురువారం బళ్లారికి చేరుకుంది. కుటుంబ కళ్యాణ ఇలాఖే ప్రధాన కార్యదర్శి బెంగళూరు రాజీవ్ గాంధీ ఆరోగ్య విజ్ఞాన విద్యాలయం కులపతి మొత్తం త్రిసభ్య కమిటీను ప్రభుత్వం నియమించింది. ఈ త్రిసభ్య కమిటీలో బెంగళూరు వైద్యకీయ కళాశాల, పరిశోధన సంస్థ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ భాస్కర్, డాక్టర్ హట్టి టీఆర్ ఉన్నారు. బాలింతల మృతిపై కమిటీ విచారణ చేపట్టింది. బాలింతల మృతిపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు.



రోజా మృతితో విషాదంలో బంధువులు

'ఆపరేషన్ కమల' వ్యాఖ్యలపై..భగ్గుమన్న బీజేపీ

● ఎమ్మెల్యేలను వస్తువులుగా పోల్చడం అవమానం : విజయేంద్ర ● ఆరోపణలు నిరూపించాలి: సీటీ రవి



బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు 'ఆపరేషన్ కమల' కుట్ర సాగుతోందని ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50కోట్ల చొప్పున చెల్లించాలని రాష్ట్ర బీజేపీ నేతలు ప్రయత్నించారని సీఎం సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడ్డారు. గురువారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలను మార్కెట్‌లో లభించే వస్తువులుగా పోల్చి సీఎం అవమానించారన్నారు. మీ ఎమ్మెల్యేలపై విశ్వాసం కోల్పోయి ఊహకు అందని ఆరోపణలు చేశారన్నారు. ఎమ్మెల్యేలపై విశ్వాసం లేనందునే రూ.50కోట్లకు అమ్ముడు పోతారని వ్యాఖ్యానించారన్నారు. ముడా కేసు ముంచుకొస్తున్న తరుణంలో సీఎం కొత్త వివాదం తెరపైకి తెచ్చారన్నారు. కనీస రాజకీయ జ్ఞానం ఉన్నవారు ఎవరైనా ఇలాంటి అబద్ధాలు మాట్లాడతారా..? అంటూ మండిపడ్డారు. 50 కోట్ల రూపాయల ఆశ చూపామనడానికి ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సుమోటోగా విచారణ జరిపించాలని, ముఖ్యమంత్రి హోదాలో 50 కోట్ల రూపాయల ప్రస్తావన తెచ్చారని డిమాండ్ చేశారు.

అధిష్ఠానాన్ని బెదిరించేందుకే...

ఉప ఎన్నికల పోలింగ్ రోజునే సీఎం సిద్దరామయ్య కొత్త పాట పాడారని బీజేపీ ప్రధాన కార్యదర్శి సునిల్‌కుమార్ మండిపడ్డారు. మరికొన్ని రోజుల్లో శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయని ఈలోగానే కొత్త ముఖ్యమంత్రి వస్తారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు కుట్ర అనేది ఒక పెద్ద జోక్ అన్నారు. సీఎంగా సిద్దరామయ్య వంద అబద్ధాలు చెప్పారని, ఇది 101వదన్నారు. ఎమ్మెల్యేలకు గ్రాంట్లు విడుదల చేయలేదని, ప్రభుత్వంపైనే తిరగబడుతుంటే వారిని అవమానించేలా కొత్త అంశం తెరపైకి తెచ్చారన్నారు.

ఎవరు ప్రయత్నించారో నిరూపించాలి : సీటీ రవి

బీజేపీ నాయకులపై సీఎం సిద్దరామయ్య ఆరోపణలు అబద్ధాలకు పరాకాష్ఠ ఎమ్మెల్సీ సీటీ రవి పేర్కొన్నారు. ఎవరు, ఎప్పుడు, ఏఏ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి రూ.50కోట్ల ప్రతిపాదన పెట్టారో సాక్షాలతో నిరూపించాలన్నారు. రూ.50కోట్లకు ఎమ్మెల్యేలు అమ్ముడు పోతున్నారంటే అంత దిగజారే స్థాయిలో మీ ఎమ్మెల్యేలు ఉన్నారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ లో 137మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, మిమ్మల్ని ఎవరూ కదిలించలేదని ఏదైనా జరిగితే మా పార్టీలో అంతర్గతంగానే కొనసాగవచ్చునని అది పరిశీలించుకోవాలన్నారు. అబద్ధాలు చెప్పకుంటే తిన్నది జీర్ణం కాదా..? అన్నారు.

సీఎంను ముట్టుకుంటే కేసులు : కేంద్రమంత్రి ఎద్దేవా

సీఎంను ముట్టుకుంటే పోలీసులు అరెస్టు చేస్తారని కేంద్రమంత్రి సోమణ్ణ ఎద్దేవా చేశారు. తనను ముట్టుకుంటే కర్ణాటక ప్రజలు వదలరంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి విరుచుకుపడ్డారు. మిమ్మల్ని ఎవరూ ముట్టుకోరని, చుట్టూ సెక్యూరిటీ ఉంటుందన్నారు. రెండుసార్లు సీఎంగా కొనసాగిన సిద్దరామయ్య ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

విజయేంద్రకు సమాధానం చెప్పాలా : సీఎం

ఆపరేషన్ కమల వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన విజయేంద్ర ప్రశ్నలపై సీఎంను కోరగా నిన్నమొన్న రాజకీయాల్లోకి వచ్చిన విజయేంద్రకు నేను సమాధానం చెప్పాలా..? అంటూ దాటవేశారు.



ఏ క్షణంలోనైనా సీఎంకు నోటీసులు

ముడా ఇళ్లస్థలాల అవినీతి కేసును వేగవంతం చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ త్వరలోనే సీఎం సిద్దరామయ్యకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా గురువారం ఆయన ఆప్తుడు, ముడా మాజీ చైర్మన్ మరిగౌడతోపాటు గతంలో మైసూరు తహసీల్దారుగా వ్యవహరించిన నటేశ్‌ను ఈడీ అధికారులు విచారణ జరిపారు. సీఎం సిద్దరామయ్య భార్య పార్వతిలకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే లోకాయుక్త విచారణకు సీఎం హాజరయ్యారు. ఈడీ నోటీసులు జారీ చేస్తే పరిణామం తీవ్రంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు

బళ్లారి నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సండూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిన సంగతి తెలిసిందే. గురువారం ఈవీఎంలను స్ట్రాంగ్ రూంకు తరలించారు. ఆరుగురు అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలో భద్రపరిచారు. సండూర్ నియోజకవర్గంలోని 253 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఓట్ల లెక్కింపు నవంబరు 23 వ తేది శనివారం ఉదయం 8గంటల నుంచి బళ్లారి నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టనున్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనంలో జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్, సార్వత్రిక ఎన్నికల పరిశీలకులు, వ్యయ పరిశీలకుల పమక్షంలో ఓటింగ్ యంత్రాలను సురక్షిత గదిలో భద్రపరిచారు. ఓటింగ్ యంత్రాల స్ట్రాంగ్ రూం తలుపుకు తాళం వేసి సీల్ వేశారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ పోలీసు సిబ్బంది కాపలా ఏర్పాటు చేశారు. 22 సాయంత్రం 6గంటల నుంచి నవంబరు 24వ తేది ఉదయం 6గంటల వరకు జిల్లా అంతటా నిషేధాజ్ఞలు విధించారు.



స్ట్రాంగ్ రూం వద్ద పోలీసు భద్రత

దళితులపై దాడి కేసులో 97 మందికి బెయిల్

సంచలనం రేపిన 98 మందికి జీవితఖైదు కేసులో ధారవాడ హైకోర్టు బెంచ్ 97 మందికి గురువారం బెయిల్ మంజూరు చేసింది.

6



నిర్మానుష్యంగా మారిన మరకుంబి గ్రామం



ఆధునిక సాగుతో అధిక లాభాలు

6

● రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
● ఉత్తమ దిగుబడి కోసమే జీకేవీకే శాస్త్రవేత్తల కృషి
● కృషి మేళా ప్రారంభంలో మంత్రి చలువరాయస్వామి

అబ్కారీశాఖలో అవినీతిని అరికట్టాలి

రూ.వందల కోట్ల లంచాలు ముట్టినట్లు జోరుగా ప్రచారం
సీఎం సిద్దరామయ్య స్పందించాలి
ఫెడరేషన్ ఆఫ్ వైన్‌మర్చంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు గురుస్వామి డిమాండ్

7



మీడియాతో ఫెడరేషన్ ఆఫ్ వైన్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుస్వామి

పరిమళించిన పసివారు

మట్టి.. రంగులతో కళాఖండాలు | **ఆర్డీటీ ఆర్ట్ ఫెస్టివల్‌లో అద్భుతాలు**





వెన్నుతట్టి ప్రోత్సహించాలేగానీ.. ఆకాశంలోని నక్షత్రాలను నేలపై ఆవిష్కరించగలరు. బంక మట్టితో భగవంతుడినే సృష్టించగలరు. సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టగలరు. అకృత్యాలకు వ్యతిరేకంగా కళల గళాన్ని వినిపించగలరు. అందరూ పసివారే..! అద్భుతమైన ప్రతిభ ఉన్నవారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించారు. అక్కడికి వచ్చిన వందలాది మంది పసివారు పరిమళించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అద్భుతాలను ఆవిష్కరించారు. రంగోలి, చేతిరాత, న్యాచురల్ కొలేజ్, పిక్చర్ పెయింటింగ్, క్లే మోడల్, ఒరిగామి ఆర్ట్‌వర్క్.. ఇలా ఆరు విభాగాలలో పోటీ పడ్డారు. కర్నూలు, అనంత ఉమ్మడి జిల్లాలోని 37 ప్రాంతాల నుంచి 222 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఒకరికి ఒకరు ఏమాత్రం తీసిపోరు. అందులో కొందరి ఆవిష్కరణలు ఇవి.

– ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

వెన్నదొంగ.. గోవర్ధనుడు



గొల్లపల్లి తండాకు చెందిన రవినాయక్, పేరమ్మ దంపతుల కుమారుడు గోవర్ధన్ అదే తండా ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. పాఠశాల ముగిసిన తర్వాత రోజూ సాయంత్రం లక్ష్మన్న అనే ట్యూషన్ మాస్టర్ వద్దకు వెళుతుంటాడు. లక్ష్మన్న చదువు చెప్పడంతోపాటు మట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్పించేవాడు. ఆ కళను పోటీలో ప్రదర్శించాడు గోవర్ధన్..! స్వామి పేరు పెట్టుకున్నందుకో ఏమో.. వెన్న దొంగ ప్రతిమను అందంగా తీర్చిదిద్దాడు. దీనికోసం 12 రోజులపాటు ప్రాక్టీస్ చేశాడట.

కళ్లెదుట అరణ్యకాండ: సంతోష్‌కుమార్



రావణుడు సీతను అపహరించుకుని వెళ్తున్నపుడు జటాయువు వీరోచితంగా పోరాడి రెక్కలు కోల్పోతుంది. సీతాపహరణ విషయాన్ని శ్రీరాముడికి వివరించి ప్రాణాలు విడుస్తుంది. ఈ ఘట్టాన్ని తన కళతో కళ్లకు కట్టాడు సంతోష్ కుమార్. కణేకల్లు మండలం కురువళ్లి గ్రామానికి చెందిన సురేష్, నాగరత్నమ్మ దంపతుల కుమారుడు. అదేగ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. దాదాపు నెలరోజులపాటు బంకమట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్చుకుని, ఆర్ట్ ఫెస్టివల్‌లో క్లేమోడల్ విభాగంలో ఎంతో సుందరంగా అరణ్యకాండ ఘట్టాన్ని ఆవిష్కరించాడు.

మహిళలపై అఘాయిత్యాలు వద్దు: అమర్‌నాథ్



మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని బొమ్మలతో చెప్పించాడు అమర్నాథ్. గుంతకల్లు మండలం వైటీ చెరువుకు చెందిన రామాంజనేయులు, సువర్ణమ్మ కుమారుడు. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నిర్మూలన అంశాన్ని ఎంచుకుని.. ఉపాధ్యాయుల వద్ద వారంరోజులపాటు శిక్షణ పొందాడు. మట్టి బొమ్మలతో మహిళలకు మద్దతుగా నినదించాడు.

విద్యార్థులు అన్ని విషయాలనూ తెలుసుకోవాలి..



విద్యార్థిదశలోనే మన మాతృదేశంలోని అన్ని అంశాల గురించి తెలుసుకోవాలి. అదే ధ్యే యంతో పాఠాలను చె బుతుంటాం. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరుణ్‌కు సైగలద్వారానే శిక్షణ ఇచ్చాను. దేశంలోని వివిధ అంశాలను రంగవల్లికలలో చూపించేలా తీర్చిదిద్దాము.

– వాణిశ్రీ, ఉపాధ్యాయిని

చదువే... సారాంశం...



నేటితరం విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్ వంటి పరికరాలపై ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. సెల్‌ఫోన్ మనకు అవసరమే అయినా.. కేవలం ఒక వస్తువుగానే భావించాలి. చదువు పట్ల మొగ్గుచూపాలనే ఈ అంశాన్ని ఎంచుకుని అక్షయ్‌కు శిక్షణ ఇచ్చాను.

– శ్రీనివాస్, ఆర్డీటీ సమ్మిళిత పాఠశాల, కూడేరు

సైగలతోనే శిక్షణ...



బధిర, మూగ పిల్లలకు శిక్షణ ఇవ్వడం నైపుణ్యంతో కూడుకున్న పని. వారికి సైగలతో మాత్రమే బోధించాలి. మా పాఠశాలలోని బధిర, మూగ విద్యార్థులు సైతం సాధారణ విద్యార్థులతో కలిసి అన్నిరకాల యాక్టివిటీస్‌లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నాం. ఈ క్రమంలోనే ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనేలా శిక్షణ ఇచ్చి తీసుకొచ్చాం.

– మారెన్న, ఉపాధ్యాయుడు, కూడేరు

రంగు రంగుల పురోగతి: వరుణ్



కూడేరుకు చెందిన శ్రీకాంత్, అంజనావతి దంపతుల కుమారుడు వరుణ్ దేశ పురోగతిని రంగు రంగుల రంగవల్లికలతో కళ్లకు కట్టాడు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. తండ్రి శ్రీకాంత్ హోటల్‌లో పనిచేస్తుంటాడు. కూడేరులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో వరుణ్ నాలుగో తరగతి చదువుతున్నాడు. పుట్టుకతోనే మూగ, బధిరుడు. వాణిశ్రీ అనే ఉపాధ్యాయిని వరుణ్‌కు 15 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఒలింపిక్స్, కొవిడ్‌కి ఎదురొడ్డి నిలబడడం, భారతీయ సంస్కృతి, ఇస్రో, మేక్ ఇన్ ఇండియా, తదితరాలను రంగవల్లికలతో ఆవిష్కరించాడు వరుణ్.

ఫోన్ వద్దు... పుస్తకం పట్టు: అక్షయ్



సెల్‌ఫోన్ వినియోగం కన్నా పుస్తక పఠనమే మానవాళికి ప్రయోజనకరమని తన కళతో ప్రదర్శించాడు అక్షయ్. కూడేరుకు చెందిన కుమార్, అనిత దంపతుల కుమారుడు అక్షయ్.. స్థానిక ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడి సమక్షంలో పది రోజులుగా బంకమట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్చుకున్నాడు. సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలు, పుస్తకాల వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరిస్తూ బొమ్మను రూపొందించి ప్రదర్శించాడు.

రైతు బిడ్డలు.. భిన్న ధ్రువాలు: సురేష్



ఒకే తల్లి కడుపున పుట్టారు. ఇద్దరూ భూమినే నమ్ముకున్నారు. కానీ.. వినియోగంలో భిన్నత్వం చూపించారు. ఒకరి భూమిలో గాలి మరలు.. మరొకరి భూమిలో పచ్చటి పొలాలను ఆవిష్కరించాడు సురేష్. కూడేరుకు చెందిన గంగమ్మ, ఎర్రిస్వామి దంపతుల కుమారుడు. వీరు వ్యవసాయం చేస్తుంటారు. సురేష్‌కు పుట్టుకతోనే వినికిడి సమస్య ఏర్పడింది. దీంతో మాటలు రాకుండాపోయాయి. కూడేరు ఆర్డీటీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మారెన్న అనే ఉపాధ్యాయుడు సైగల ద్వారానే చదువు నేర్పుతున్నారు. దీంతోపాటు మట్టి బొమ్మల తయారీనీ నేర్పిస్తున్నాడు. ఈ అంశాన్ని 12 రోజులపాటు నేర్చుకున్న సురేష్.. రైతు సోదరులను పొలంలో అద్భుతంగా ఆవిష్కరించాడు.



మట్టితో కళాఖండాలను తయారు చేస్తున్న చిన్నారులు

రేవతి.. ప్రకృతి



కొండల నడుమ నుంచి చెక్‌డ్యామ్‌కు చేరిన వర్షపునీరు.. అటు నుంచి బ్రిడ్జిల కింద కాలువల ద్వారా పొలాలకు చేరే నీరు. ఆ నీటితో పంటపొలాల సాగు.. ఇలా ప్రకృతి సౌందర్యాన్ని ఆవిష్కరించింది రేవతి. పామిడి మండలం ఎద్దులపల్లికి చెందిన నాగరాజు, ఆదిలక్ష్మి దంపతుల కూతురు. నాగరాజు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా ఆదిలక్ష్మి ఇళ్లలో పనిచేస్తుంటారు. అదే గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో రేవతి ఐదో తరగతి చదువుతోంది. ఈ కళను ప్రదర్శించేందుకు 25 రోజులపాటు ప్రాక్టీస్ చేసింది. చుట్టుపక్కల లభించే అరంటు, దుబాయి కాయలు, గవ్వలు, కుసుములు, బీన్స్, చింతపిచ్చలు, గద్దముక్కకాయలు, చెండుపూలతో ప్రకృతి రమణీయతను కళ్లకు కట్టింది.

ప్రజ్వల్.. జోడు లింగాలు

కూడేరులోని సంగమేశ్వరం జోడు లింగాల ఆలయం ప్రఖ్యాతి గాంచింది. ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఆర్ట్ ఫెస్టివల్‌కు జోడులింగాలు కదిలొచ్చాయి. అండేపల్లికి చెందిన రాజు, మంజుల దంపతుల కుమారుడు ప్రజ్వల్.. వీటిని మట్టితో ఆవిష్కరించాడు. కూడేరు ఆర్డీటీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. చిన్నపుడే తల్లిదండ్రులిద్దరు చనిపోయారు. అవ్వాతాతలు కర్రమ్మ, నాగప్ప వద్ద ఉంటూ బడికి వెళుతున్నాడు. వారంరోజులపాటు ప్రాక్టీస్ చేసి ఆర్ట్ ఫెస్టివల్‌లో మొక్కల కాండాలు, అరటి బెరడు, రాళ్లతో జోడులింగాల నమూనాను తీర్చిదిద్దాడు.



రంగవల్లికలో శ్రీనివాసుడు: సుదర్శిని

ఆర్ట్ ఫెస్టివల్ రంగవల్లుల విభాగంలో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామిని ఆవిష్కరించింది చిన్నారి సుదర్శిని. కురువల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మర్రిస్వామి, రైతుకూలీ శ్రీదేవి దంపతుల కూతురు తను. అదే గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. సుదర్శినికి రంగవల్లులపై ఆసక్తి ఎక్కువ. అందుకే ఇదే విభాగంలో స్వామివారిని తీర్చిదిద్దింది.







మహిళల భద్రత: ప్రవీణ్

మహిళల భద్రత ఇతివృత్తంగా రంగవల్లులను తీర్చిదిద్దాడు ప్రవీణ్. అనంతపురం అంబేడ్కర్ నగర్‌కు చెందిన మల్లేశ్వరి, శ్రీనివాసులు దంపతుల కుమారుడు. మల్లేశ్వరి ఓ హోటల్‌లో పనిచేస్తోంది. శ్రీనివాసులు కొన్నేళ్ల క్రితం చనిపోయారు. ప్రవీణ్ ఆర్డీటీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను గురించి ఉపాధ్యాయులద్వారా తెలుసుకుని, వారికి భద్రత కల్పించాలనే అంశాన్ని రంగవల్లిక ద్వారా చూపించాడు. అత్యాచారాలు, చులకన భావం, వరకట్న వేధింపులు, యాసిడ్ దాడులు, హత్యలను నివారించాలని రంగవల్లికల ద్వారా డిమాండ్ చేశాడు ప్రవీణ్.

దళితులపై దాడి కేసులో 97 మందికి బెయిల్

బళ్లారి గాంధీనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సంచలనం రేపిన 98 మందికి జీవితఖైదు కేసులో 97 మందికి బెయిల్ మంజూరు అయ్యింది. కొప్పళ జిల్లా, గంగావతి తాలూకా పరిధిలోని మరకుంబి గ్రామంలో దళితులపై దాడికి సంబంధించిన కేసులో జీవిత ఖైదు శిక్షపడిన 98మందిలో 97మందికి ధారవాడ హైకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఏ-1 ముద్దాయిగా ఉన్న మంజునాథ్ బెయిల్‌కు అర్జీవేయనందున అతడికి బెయిల్ లభించలేదు. బెయిల్ పొందిన వారిలో ప్రతి ఒక్కరికీ రూ.50వేల రూపాయల పూచికత్తుతో కోర్టు జమీను మంజూరు చేసింది. ఈ కేసులో ఐదేళ్ళు శిక్ష పడిన ఇద్దరు నిందితులకు కూడా బెయిల్ లభించింది. దశాబ్దం క్రితం సరిగ్గా 2014, ఆగస్టు 28 వతేదీన మరకుంబి గ్రామంలో అగ్రవర్ణాలకు చెందిన వారు దళితులపై దాడికి పాల్పడిన ఘటనలో అక్టోబరు 21వ తేదీన కొప్పళ జిల్లా కోర్టు 98మందికి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. దీనిని సవాల్ చేస్తూ నిందితులు ధారవాడ హైకోర్టును ఆశ్రయించారు. నవంబరు 13వ తేదీనద్విసభ్య పీఠం అర్జీని విచారించి 97మందికి బెయిల్ మంజూరు చేసింది. దశాబ్దం క్రితం మరకుంబి గ్రామానికి చెందిన ఇరువర్గాలకు చెందిన యువకులు ఒక సినిమా టికెట్ తీసుకునే సమయంలో ఏర్పడిన గొడవ కారణంగా అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణాలకు చెందిన వారు దళితుల ఇళ్ళపై దాడి చేసి పలువురిని గాయపరిచారు. ఈ నేపథ్యంలో అప్పట్లో 117 మందిపై కేసు నమోదు అయింది. అప్పట్లో దళితులపై దాడి చేసినందుకు ఇకే సారి ఇంతమందిపై కేసు నమోదు కావడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. అదే కేసులో 101మంది జీవిత ఖైదు పడడం మరోసారి చర్చకు దారితీసింది. ప్రారంభంలో ఈ కేసు కొప్పళ జిల్లా కోర్టు విచారణ జరిపింది. అనంతరం 2015లో కేసు ప్రధాన సెషన్స్ కోర్టుకు బదిలీ కావడంతో అప్పటి నుంచి సుదీర్ఘంగా విచారణ జరిగింది. అక్టోబరు 21వ తేదీన కొప్పళ జిల్లా సెషన్స్ కోర్టు 101మంది జీవిత నిందితులుగా పేర్కొంటూ ఆదేశాలు జారీచేసింది. వీరిలో ముగ్గురు ఎస్సీలు కావడంతో అట్రాసిటీ కేసు వర్తించని కారణంగా ముగ్గురికి ఐదేళ్ళపాటు జైలు శిక్ష, రూ 2వేల జరిమానా విధించింది. మిగిలిన 98మందిని జీవిత ఖైదు విధించడంతో పాటు ఐదే వేల రూపాయల జరిమానా విధించిన విషయం తెలిసిందే. ఈ కేసులో 98మందిలో 97 మందికి ధారవాడ హైకోర్టు జామీను మంజూరు చేసింది.

గ్రామంలో నిర్మానుష్యం..

మరకుంబి గ్రామంలో దశాబ్దం క్రితం జరిగిన దళితులు, అగ్రవర్ణాల మధ్య జరిగిన జాతి సంఘర్షణ... హింసాచార కేసులో నిందితులుగా ఉన్న వారికి ధారవాడ హైకోర్టు బెయిల్ మంజూరు చేసినా గ్రామంలో ఇంకా నిశ్శబ్ద వాతావరణమే నెలకొంది. గ్రామంలో చాలా కుటుంబాలు ఇంటి యజమానులు జైలువాసం గడుపుతున్న కారణంగా, మహిళలు మాత్రం పొలాల్లో కూలీపనులకు వెళుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన యువకులు వరికల్లాల్లో పనిచేస్తున్నారు. గ్రామంలో 101 మందిని నిందితులుగా పేర్కొంటూ కొప్పళ కోర్టు తీర్పునిచ్చిన నాటి నుంచి గ్రామంలో కళతప్పింది. వృద్ధులు మాత్రం గ్రామాల్లో రచ్చబండపై కూర్చొని చిర్చంకుంటున్న దృశ్యాలు గ్రామంలో కనిపిస్తున్నాయి. ఇక దళితుల కాలనీలో జనసందడే కనిపించడం లేదు. విద్యార్థులు మాత్రం యథాతథంగా పాఠశాలకు వెళ్తున్నారు. పోలీసులు నిత్యం గ్రామంలో పహారా కాస్తున్నారు.



మొక్కలతో ఉత్సాహంగా విద్యార్థులు

ఆధునిక సాగుతో అధిక లాభాలు

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాగుతో అన్నదాత విరివిగా లాభాలు పొందాలని వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి అభిప్రాయపడ్డారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం గాంధీ కృషి విజ్ఞానకేంద్రం ప్రాంగణంలో కృషి మేళాను మంత్రి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యవసాయ అనుబంధ సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ దేశంలో 75శాతం వ్యవసాయంపైనే ఆధారపడ్డారన్నారు. 60 దశకంలో హరితవిప్లవం ద్వారా ఆహారధాన్యాల ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతికి మలుపు సాధ్యమైందన్నారు. 1964-65లో ఆహార ఉత్పత్తి 45.4 మిలియన్ టన్నులు ఉండేదని 2023-24 నాటికి 332 మిలియన్ టన్నులకు పెరిగిందని, 2047 నాటికి 437 మిలియన్ టన్నులకు పెరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ఆరంభమైన తొలి వ్యవసాయ విశ్వవిద్యాలయం 60ఏళ్లుగా నూతన వంగడాలు, ఆధునికసాగు విధానాలను ఆవిష్కరించడంలో రైతులకు అండగా ఉందన్నారు. ఇక్కడి విద్యార్థులు ఉద్యోగలక్ష్యం కాకుండా పరిశోధనలవైపు ప్రాధాన్యం ఇవ్వడం దేశంలో వ్యవసాయ సంస్కరణలకు కారణమవుతోందని కొనియాడారు. ఏటా జరిగే కృషి మేళా కేవలం రాష్ట్రానికి చెందిన రైతులకే కాకుండా పొరుగురాష్ట్రాల వారికీ ఆదర్శం అనిపించేలా కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో 78 లక్షలమందికి పైగా రైతులు 1.25 కోట్ల వ్యవసాయ కార్మికులు ఉన్నారని వారి జీవనం వ్యవసాయంతో ముడిపడి ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తోందని, వెయ్యి కోట్ల రాయితీతో యంత్రోపకరణాలు, నీటి పర్యవేక్షణతోపాటు 2,100 కోట్ల పంటల బీమాను నేరుగా అన్నదాతల ఖాతాలకు బదిలీ చేశామన్నారు. ఐదు గ్యారెంటీల ద్వారా కూడా రైతులకు ప్రయోజనం లభిస్తోందన్నారు. అధ్యక్షత వహించిన యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ మాట్లాడుతూ సంపాదన ప్రతి మనిషి ఆశయంగా ఉండాలని అదే దేశ, రాష్ట్ర ప్రగతికి కారణమవుతుందన్నారు. బాగల్కోట ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ విష్ణువర్ధన్ ముఖ్యులుగా పాల్గొని పంటల సాగు, నూతన వంగడాల అంశాలపై మాట్లాడారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ సురేశ్ పర్యవేక్షణలో కృషి మేళా సాగింది.

వందలాది స్టాల్స్ - ఆకట్టుకున్న కొత్త వంగడాలు

కృషి మేళాలో వందలాది స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. వ్యవసాయ పరిశోధన, క్రిమిసంహారక, పోషక విలువలు, డ్రిప్ ఇరిగేషన్, విత్తనాల కంపెనీలతోపాటు వివిధ ప్రాంతాలలో సాగు చేసి అత్యధిక దిగుబడులు సాధిస్తున్న రైతుల పంటల ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రస్తుత ప్రదర్శనలో పరిచయం చేసిన కొత్త వంగడాలు మొక్కజొన్న, అలసంద, పశుగ్రాసం, సూర్యకాంతి పంటల నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాగా తొలి రోజున 3.82లక్షల మంది కృషి మేళాను సందర్శించినట్టు అధికారులు ప్రకటించారు.

వర్షంతో సందర్శకులకు ఇబ్బందులు

కృషి మేళా సందర్శించాలని ఉత్సాహంగా వచ్చిన ప్రజలకు నిరుత్సాహం కలిగింది. నగరవ్యాప్తంగా ఉదయం నుంచి చిరుజల్లులు ఆరంభమయ్యాయి. మధ్యాహ్నం జీకేవీకే ప్రాంగణంలో వర్షం హోరెత్తడంతో మేళా జరిగే ప్రాంతం బురదమయంగా మారింది. ప్రతిచోటా నీరు నిల్వ ఉండడంతో సందర్శకులు ఇబ్బంది పడ్డారు. తోటల నమూనాలను సందర్శించేందుకు వెళ్లినవారు బురదమట్టిలో ఇబ్బంది పడ్డారు.



హళ్ళికార్ ఎద్దులు



దేశవాళీ ఆవులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

గురునానక్ (జయంతి)



సిక్కు తొలి గురువు గురునానక్ పుట్టినరోజును ప్రకాశ్ ఉత్సవ్‌గా, గురు నానక్ దేవ్‌జీ గుర్పరబ్‌గా పిలుస్తారు. సిక్కుమతం స్థాపకుడైన గురునానక్ 1469లో కార్తీక పౌర్ణమి రోజున జన్మించారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజును దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సిక్కులు ఘనంగా ఆచరిస్తారు. గురుద్వారాల వద్ద కులమతాలకు అతీతంగా లంగర్ పేరిట భోజనం అందిస్తారు.

గోరా శాస్త్రి(జయంతి)



ప్రముఖ సంపాదకులు, సంఘ సంస్కర్త 'గోరా'గా పేరొందిన గోపరాజు రామచంద్రరావు 1902 నవంబరు 15న ఒడిశా రాష్ట్రంలోని ఛత్రపురంలో జన్మించారు. హేతువాది, నాస్తిక సిద్ధాంతాలతో జీవితాంతం కొనసాగారు. వర్ణ వ్యవస్థ, అంటరానితనంపై యుద్ధాన్ని ప్రకటించి 1940లో ప్రపంచంలోనే తొలి నాస్తిక కేంద్రాన్ని ప్రారంభించారు. నాస్తికత్వాన్ని నిర్మాణాత్మక జీవిత విధానంగా ప్రతిపాదించారు. ఎన్నో రచనలు చేశారు. పత్రికలు కూడా నడిపారు. మహాత్మాగాంధీతో కలసి అస్పృశ్యత నిర్మూలనకు పాటు పడ్డారు. దళితుల ఆలయ ప్రవేశాన్ని, సమష్టి భోజనాలు, సామూహిక వివాహాలు నిర్వహించి సాంఘిక సమానతకు కృషి చేశారు. 1975 జూలై 26న తుదిశ్వాస వీడారు. 2002లో స్మారక ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

డాక్టర్ జీవీ కృష్ణారావు (జయంతి)



డాక్టర్ గవిని వెంకట కృష్ణారావు 1914 నవంబరు 15న జన్మించారు. తెనాలి ప్రాంతానికి చెందిన ఆయన హేతువాది, దార్శనికుడు కవి, సాహితీవేత్త, రచయితగా రాణించారు. కళా పూర్ణోదయం అనే సిద్ధాంత వ్యాసం రాసి మద్రాసు యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు. వరూధిని, శివరాత్రి, యుగసంధ్య వంటి సుదీర్ఘ కవితలు రాసి ప్రచురించారు. కీలుబొమ్మలు రచన ఎంతో పేరొందింది. ప్రముఖ తత్వవేత్తలు ప్లేటో అండ్ కాంట్‌ల రచనలను అనువాదం చేసిన ఘనత ఆయనది. 'భిక్షపాత్ర' నాటిక జాతీయస్థాయిలో గుర్తింపు పొంది 16 భాషలలో అనువాదమై ఆలిండియా రేడియోలో ప్రసారమైంది. 1979 ఆగస్టు 23న కన్నుమూశారు.

పాల్ఘాట్ కేవీ నారాయణస్వామి (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత పాల్ఘాట్ కొల్లెన్ గోడ్ విశ్వనాథన్ (కేవీ) నారాయణస్వామి 1923 నవంబరు 15న కేరళ రాష్ట్రం పాల్ఘాట్ ప్రాంతంలో జన్మించారు. కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసుడు. శృతి తప్పకుండా పాడేంతటి నేర్పరి. అసలు పేరు రామనారాయణన్ అయితే నారాయణస్వామిగానే పేరొందారు. ట్రావెన్‌కోర్ రాజ కుటుంబీకులతో సన్నిహితంగా ఉండడంతో ఆయన ప్రతిభకు మరింత ప్రాచుర్యం లభించింది. అన్ని రకాల కీర్తనలను పలు భాషలలో ఆలపించారు. 1965లో స్కాట్లాండ్‌లో జరిగిన ఎడిన్‌బర్గ్ ఫెస్టివల్‌లో కచేరీలో పాల్గొన్నారు. వెస్లియన్ యూనివర్శిటీలో సంగీతం ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. దేశ విదేశాలలో పర్యటించారు. సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు. 2002 ఏప్రిల్ 1న కన్నుమూశారు.

వాకాటి పాండురంగారావు (జయంతి)



ప్రముఖ తెలుగు కథా రచయిత వాకాటి పాండురంగారావు 1934 నవంబరు 15న మద్రాసులో జన్మించారు. జర్నలిస్ట్‌గా ఆంధ్రప్రభ వారపత్రికకు సుదీర్ఘకాలం సంపాదకీయాలు రాశారు. అనంతరం పలు ఆంగ్ల పత్రికలతోపాటు ఆంధ్రజ్యోతి, ఆనందవాణి తదితర పలు పత్రికలలో సేవలందించారు. మిత్రవాక్యం, చేతవెన్నముద్ద, సృష్టిలో తీయనిది, దిక్సూచి ఆయన ప్రముఖ రచనలు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగాను, విశాఖపట్నం పోర్టుకు డిప్యూటీ డైరెక్టర్‌గాను వ్యవహరించారు. ఆంధ్ర సాహిత్య అకాడమీ, గోపీచంద్ అవార్డు తదితర అవార్డులు అందుకున్నారు. 1999 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

సానియా మిర్జా (పుట్టినరోజు)



ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మిర్జా 1986 నవంబరు 15న ముంబైలో జన్మించారు. ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. 2003 నుంచి 2013 వరకు రిటైరయ్యేదాకా సింగిల్స్‌లో దేశంలో నెంబరు వన్ ర్యాంకు క్రీడాకారిణిగా ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్‌చే గుర్తింపు పొందారు. 2014లో డబ్ల్యుటీఏ ఫైనల్స్‌లో గెలుపొంది సత్తా చాటుకున్నారు. ఏసియన్ గేమ్స్, కామన్‌వెల్త్‌గేమ్స్, ఆఫ్రో-ఏషియన్ గేమ్స్‌లలోనూ రాణించి 14 మెడల్స్, ఇతర గౌరవాలు సాధించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్నారు. కాగా సౌత్ ఏసియాకు గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఉన్నారు. పాకిస్థానీ క్రికెటర్ షోయబ్ మాలిక్‌ను వివాహం చేసుకున్నారు.

డ్రాగన్‌ఫ్రూట్‌తో రూ.లక్షల ఆదాయం

▸▸ ఉపాధి హామీ పథకంతో అమలు - యువరైతు నాగేశ్ విజయం

బంగారపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విదేశీరకం డ్రాగన్ ఫ్రూట్‌ను పండిస్తూ లక్షలాది రూపాయలను గడిస్తూ రైతు ఆదర్శంగా నిలిచారు. కోలారు జిల్లా టమోటా పంటకు పేరొందిన తరుణంలో తాలూకాలోని ఆలంబాడి జ్యోతేనహళ్ళి గ్రామపంచాయతీకి నత్తబెలెకు చెందిన యువరైతు నాగేశ్ యూట్యూబ్ ద్వారా డ్రాగన్ ఫ్రూట్ సాగు గురించి తెలుసుకున్నాడు. ఉపాధి హామీ పథకం కింద పంటను పండించి ఉత్తమ దిగుబడి సాధిస్తూ లక్షలాదిరూపాయలు సాధిస్తున్నాడు. వివరాలిలా. పదో తరగతి వరకు చదివిన నగేశ్ తొలుత టమోటాతోపాటు పలు రకాల పంటలు పండించి సరైన ధర లభించక నష్టపోయాడు. చివరి ప్రయత్నంలో యూట్యూబ్‌లో చూసిన డ్రాగన్ ఫ్రూట్ గురించి ఆరా తీశాడు. యలహంక నుంచి పింక్ రకం డ్రాగన్ ఫ్రూట్



తోటనుంచే నేరుగా ఎగుమతి ఇలా...



పండ్లను చూపుతున్న రైతు నాగేశ్

మొక్కలను తెచ్చి మూడు ఎకరాలలో నాటాడు. ఒక రాతి స్తంభానికి మరో స్తంభానికి 8 అడుగుల అంతరం ఉండేలా చూసుకున్నాడు. అలాగే పాదుకు కనీసం 12 అడుగుల అంతరం పాటించాడు. ఒక ఎకరాకు 500 రాతి స్తంభాలు అవసరం కానున్నాయి. ఇలా 2వేల మొక్కలను డ్రిప్ ఇరిగేషన్ విధానంలో సాగు చేశాడు. ఇందుకు ఎకరాకు రూ.5-6లక్షల ఖర్చు అయ్యింది. ప్రస్తుతం చక్కటి దిగుబడి వస్తోందని గిట్టుబాటు ధరతో లాభం గడించినట్టు రైతు నాగేశ్ తెలిపారు. 9 నెలల్లో నాలుగుసార్లు కోత చేయగా ఎకరాకు టన్ను వరకు దిగుబడి ఉంటుందన్నారు. ప్రతి కేజీ రూ.150 చొప్పున బెంగళూరు ఇతర ప్రాంతాలవారు తోటనుంచే తీసుకెళ్తున్నారన్నారు. నరేగా పథకం కింద సహాయధనం పొంది డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న యువరైతు ఇతరులకు ఆదర్శంగా నిలిచారని వ్యవసాయ సహాయక డైరెక్టర్ శివారెడ్డి ప్రశంసించారు.

కెనరాబ్యాంకు రిటైల్ ఎక్స్‌పోకు జనాదరణ



కెనరాబ్యాంకు సర్కిల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ మహేశ్ ఎంపాయ్ తదితరులు

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల రిటైల్ ఎక్స్‌పోకు జనాదరణ లభించింది. మాన్యతా టెక్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోకు 12మంది కార్ల డీలర్‌లు, 42మంది బిల్డర్‌లు తమ స్టాళ్లను ఏర్పాటు చేశారు. బెంగళూరు సర్కిల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ మహేశ్ ఎంపాయ్ మాట్లాడుతూ నగర ప్రజలకు అవసరమైన కారు, హోం లోన్‌లు సరళీకృతంగా అందించాలనే లక్ష్యంతో ఎక్స్‌పోను ఏర్పాటు చేశామన్నారు. నగర ప్రజలు పెద్దసంఖ్యలో రెండు రోజులు ప్రదర్శనలకు వచ్చారన్నారు. బిల్డర్‌లు శ్రీరామ్ ప్రాపర్టీస్‌కు చెందిన శేఖర్ హెచ్‌కే, స్వామిత్వా గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రోహిత్ మెహతాలు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో వ్యవస్థాపక దినోత్సవం

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం సంబరంగా చేసుకున్నారు. బెంగళూరు జోనల్ హెడ్ నవనీత్‌కుమార్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్‌బ్యాంకు ఒక లక్ష్యం కోసం ఏర్పడిందని అన్ని వర్గాలకు ఆర్థికపరమైన చేయూత ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 106వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా 855 శాఖల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. యనియన్ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవంలో
బెంగళూరు జోనల్ హెడ్ నవనీత్ కుమార్ తదితరులు

దేశభవిష్యత్తుకు బాటలు వేసిన నెహ్రూ

బాగేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ ఉజ్వల భవిష్యత్తుకు తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ చక్కటి బాటలు వేశారని చిక్కబళ్ళాపుర జిల్లా సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు హెచ్‌వి నాగరాజు అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దేవరగుడిపల్లి గ్రామపంచాయతీలోని గిరిజా కల్యాణమండపంలో గురువారం నెహ్రూ జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 20 వరకు సహకార వారోత్సవం కొనసాగుతుందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధిలో సహకారసంఘాల పాత్ర కీలకమన్నారు. రైతుల పథకాలను అమలు చేయడంలో సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని, రైతుల సమస్యల పరిష్కారానికి మరింత శ్రమించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. మలకచరవుపల్లి పాల ఉత్పత్తి సహకార సంఘం భవనానికి రూ.2.50లక్షల చెక్కు అందచేశారు. కోచిముల్ మాజీ అధ్యక్షుడు



ప్రసంగిస్తున్న నాగరాజు

మంజునాథరెడ్డి, సహకార సంఘం పదాధికారులు అమర్, లక్ష్మీపతి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరమైన పథకాలతో పర్యావరణాన్ని సంరక్షించాలి



చర్చాగోష్టిలో డాక్టర్ హరీశ్ బర్షీలియా తదితరులు

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సుస్థిరమైన పథకాలతో పర్యావరణ సంరక్షణ జరపాలని ఇస్రో క్లస్టర్ చైర్మన్ డాక్టర్ హరీశ్ బర్షీలియా అభిప్రాయ పడ్డారు. రామయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ సైన్స్‌లో ఇటీవల ప్రగతి అనే అంశంపై చర్చాగోష్టిని నిర్వహించారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎంఆర్ సీతారాం అధ్యక్షత వహించి మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతి ఒక్కరి బాధ్యత ముఖ్యమన్నారు. సోలార్ పవర్, విండ్‌పవర్‌ల వినియోగం పెరగాలన్నారు. విద్యార్థులు పరిశోధనలు, సాంకేతిక ప్రగతి పట్ల దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ బర్షీలియా మాట్లాడుతూ ఒక టన్ను స్టీల్ ఉత్పత్తికి ఒక టన్ను కార్బన్‌డై ఆక్సైడ్ వెలువడుతుందని తద్వారా పర్యావరణంలో కాలుష్యం పెరుగుతుందన్నారు. 2070 నాటికి జీరో కార్బన్ చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడిస్తున్నారని అది సాధ్యం కావాలంటే సుస్థిరమైన పథకాలు అవసరమన్నారు. జాతీయస్థాయిలో పథకాలను రూపొందించాలన్నారు. సోలార్ మిషన్, ఎలక్ట్రికల్ వెహికల్స్ ప్రాధాన్యత పెరగాలన్నారు. ఐఐఎస్‌సి ప్రొఫెసర్ అశోక్ ఎం రాయచూరు మాట్లాడుతూ బట్టలనుంచి బూట్‌ల ఉత్పత్తిదాకా మెటీరియల్ అవసరమని వస్తువుల వినియోగంపై ఎక్కువ ఆలోచించాలన్నారు. తొలుత రాగిని దిగుమతి చేసుకునే వాళ్లమని ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్నామన్నారు. సమాజంలో పర్యావరణ మార్పులు జరగాలంటే ప్రతి ఒక్కరిది బాధ్యత కావాల్సిందే అన్నారు. కార్యక్రమంలో గోకుల సంస్థ డైరెక్టర్, హెచ్‌వి పార్శ్వనాథ్, అడ్వైజర్ కరిసిద్దప్ప, ప్రిన్సిపాల్ ఎన్‌వీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అబ్కారీశాఖలో అవినీతిని అరికట్టాలి

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అబ్కారీశాఖలో అవినీతి నియంత్రణకు ప్రభుత్వం చొరవ చూపాలని ఫెడరేషన్ ఆఫ్ వైన్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుస్వామి డిమాండ్ చేశారు. గురువారం అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎక్సైజ్ లైసెన్స్ దారుల సమస్యలపై ముఖ్యమంత్రి అధ్యక్షతన సభ జరపాలని డిమాండ్ చేశారు. అబ్కారీశాఖ బాధ్యతలను ఆర్థికమంత్రి పర్యవేక్షించాలన్నారు. గత నెల 25న నగరంలో లైసెన్స్‌దారుల భారీ సమావేశం, ర్యాలీ చేశామన్నారు. సమస్యలపై ప్రభుత్వానికి డిమాండ్ చేసినా ఎటువంటి ప్రయోజనం లేకపోయిందన్నారు. అవినీతి నియంత్రించాలనేది మా ప్రధానమైన డిమాండ్ అన్నారు. అబ్కారీ ఆర్థికశాఖతో అనుసంధానంగా ఉన్నందున ఆర్థికశాఖ మంత్రి పర్యవేక్షించడం సముచితమన్నారు. తమ డిమాండ్లకు రూపురేఖలు మారిపోయాయన్నారు. రూ.500 - 900 కోట్లు లంచం వసూలు చేశారని, లైసెన్స్ దారులు ఎవరూ మాట్లాడలేదన్నారు. కానీ జాతీయస్థాయిలో కర్ణాటక అబ్కారీశాఖలో వందలకోట్లు వసూలయ్యాయని ప్రచారం సాగుతోందన్నారు. అబ్కారీ అధికారుల ప్రమోషన్‌లు, బదిలీల విషయంలో సతీశ్‌జార్కిహొళి మినహా మిగిలిన అందరు మంత్రులపైనా ఆరోపణలు వచ్చాయన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని లేనిపక్షంలో ఈనెల 20న రాష్ట్రమంతటా వైన్‌షాప్‌లు బంద్ చేస్తామని హెచ్చరించారు.

వర్షంతో రాకపోకలకు అంతరాయం

చింతామణి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలో గురువారం జోరువర్షం కురిసింది. రోడ్లపై వర్షపునీరు భారీగా ప్రవహించడంతో వాహన చోదకులు, ఇతర వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపునీరు కాలువలలో సజావుగా వెళ్లేలా చేయడంలో జిల్లా, తాలూకా యంత్రాంగం విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా వర్షం కురవగా జనజీవనం అస్తవ్యస్థమైంది. ప్రత్యేకించి లోతట్టు ప్రాంతాల వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంజి రోడ్డు, సంత మైదానం, బంబూ బజార్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నగరసభ పంప్‌హౌస్ వద్ద ఇలా..

ఉత్సాహంగా అక్షరజ్యోతి

శిడ్లఘట్ట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాల అక్షరజ్యోతి యాత్రా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. బీదర్‌కు చెందిన కల్యాణ కర్ణాటక ప్రతిష్ఠాన ఆధ్వర్యంలో కర్ణాటక నామకరణం చేసి 50ఏళ్లు పూర్తైన సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా 63రోజులపాటు పర్యటించి ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీ విద్యార్థులకు కన్నడ నేల, నీరు, సంస్కృతిపై అవగాహన కల్పిస్తోంది. ఉత్తమ మార్కుల సాధనకు ప్రోత్సహించేందులా అక్షరజ్యోతి కార్యక్రమం చేపట్టింది. ఉత్తమ పౌరులుగా తీర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డాక్టర్ సిద్దయ్య అభిప్రాయపడ్డారు.

శిడ్లఘట్టలో ద్విచక్రవాహనాల వేలం

శిడ్లఘట్ట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను గురువారం బహిరంగ వేలం వేశారు. సీఐ ఎం శ్రీనివాస్ నేతృత్వంలో ప్రక్రియ సాగింది. మొత్తం 13 వాహనాలను వేలం వేశారు. వేలంలో పాల్గొనేవారికి షరతులు విధించారు. వేలంలో పాల్గొనదలిచేవారు రూ.500 చెల్లించి పాల్గొనాలని సూచించారు. వేలంలో వాహనాన్ని పొందినవారు మిగిలిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై వేణుగోపాల్, రూరల్ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాల వేలంలో గుమిగూడిన ప్రజలు

17న వనభోజన ఉత్సవానికి రేణుకాచౌదరి రాక

బెంగళూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కమ్మవారి సంఘం బెంగళూరు నార్త్ ఆధ్వర్యంలో ఈనెల 17న ఆదివారం జరిగే కార్తీక మాస వనభోజన మహోత్సవానికి కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ రేణుకాచౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నట్టు అధ్యక్షుడు గుమ్మడి సాంబశివరావు తెలిపారు. యలహంకలోని నిట్టేమీనాక్షి కళాశాల రోడ్డులో పత్తిపాటి ఆంజనేయులు తోటలో వనమహోత్సవం ఉంటుందన్నారు. కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక అతిథిగా హాజరవుతారని గౌరవ అతిథులుగా చిత్రదుర్గ మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, సాగునీటి ప్రాజెక్టుల క్రెస్ట్‌గేట్ టెక్నికల్ అడ్వైజర్ నాగినేని కన్నయ్యనాయుడు, సింధనూరు కమ్మవారి సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీహర్ష, జయదేవ ఆసుపత్రుల సర్జన్ నెక్కంటి మురళీకృష్ణ ముఖ్యులుగా పాల్గొంటారన్నారు. ఉదయం 7 గంటలకు సత్యనారాయణ పూజ, 10 గంటలనుంచి వినోద కార్యక్రమాలు, శ్రీరామ ప్రతీక్ష నృత్యరూపకం ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక సమావేశం ఉంటుందని సన్మానం అనంతరం వనభోజనం, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

కృషి మేళాలో పెర్‌ఫెక్ట్ స్టాల్‌కు ఆదరణ

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీకేవీకేలో కృషిమేళాలో ఏర్పాటైన గ్లోబల్‌గ్రీన్ అగ్రినోవా సంస్థవారి పెర్‌ఫెక్ట్ బ్రాండ్ స్టాల్‌కు ప్రజలనుంచి ఉత్తమ స్పందన లభించిందని సంస్థ అధినేత బి.ఎస్.మూర్తి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వృక్ష ఆయుర్వేదం ద్వారా రూపొందించిన పెర్‌ఫెక్ట్ మందు వాడకం ద్వారా పంటలలో అన్ని రకాల ఆకుముడత వైరస్‌లను, ఇతర రోగాలను నివారించవచ్చునన్నారు. కృషిమేళాలో అగ్రిఇన్‌పుట్స్ విభాగంలో స్టాల్‌నెంబరు 92ను ఏర్పాటు చేశామన్నారు. సందర్శకులు పెర్‌ఫెక్ట్ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



స్టాల్‌లో ఉత్పత్తుల ప్రదర్శన

సంప్రదాయ విలువలను పాటించాలి

▸▸ విద్యార్థులకు డాక్టర్ మహేశ్‌జోషి పిలుపు

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి సంప్రదాయ విలువలను విద్యార్థులు పాటించాలని కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, నాడోజా డాక్టర్ మహేశ్‌జోషి పిలుపునిచ్చారు. డాక్టర్ హెచ్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో కన్నడ రాజ్యోత్సవం గురువారం జరిగింది. ముఖ్యులుగా పాల్గొన్న మహేశ్‌జోషి మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్ర ఏర్పాటు, రాజ్యోత్సవ చరిత్ర, మన భాష, సంస్కృతి గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. రాజ్యోత్సవంలో భాగస్వామ్యం కావడం ద్వారా మన పరంపర భావితరాలకు అందించేవారు కావాలన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎస్ సుబ్రమణ్య అధ్యక్షత వహించారు. ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వెంకట శివారెడ్డి, బసవనగుడి నేషనల్ కళాశాల చైర్మన్ ఇస్తూరి సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ డియా జయదేవప్పతోపాటు నందీశ్ తదితరులు పాల్గొన్నారు.



కన్నడ రాజ్యోత్సవంలో డాక్టర్ మహేశ్‌జోషి తదితరులు

బేడరపల్లిలో బాలల దినోత్సవం

హోసూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని బేడరపల్లి ప్రభుత్వ పంచా యతీ యూనియన్ మిడిల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యా ఉత్సవం నిర్వహించారు. 1 నుంచి 8వ తరగతి వరకు 900 మందికి పైగా తమిళం, ఆంగ్ల మీడియం విద్యార్థులు ఉన్నారు. గురువారం బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా 'మా పాఠశాల, మా గౌరవం' అనే నినాదంతో పాఠశాలకు అవసరమైన విద్యా సామగ్రిను అందజేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ సూచనతో పెద్ద సంఖ్యల్లో ప్రజలు, తల్లిదండ్రులు తమ పిల్లలతో పాఠశాలకు అవసరమైన గొడుగులు, పాత్రలు, శానిటరీ వస్తువులు, పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్టేషనరీ తదితర నిత్యావసర వస్తువులను తీసుకొచ్చి ర్యాలీగా పాఠశాలకు తీసుకొచ్చారు. ర్యాలీని పాఠశాల విద్యాశాఖ జిల్లా అధికారి మునిరాజ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు కళాప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పొన్‌నాగేశ్ పర్యవేక్షించారు. కార్యక్రమంల్లో ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మునిరాజ్, కౌన్సిలర్ రజనీకాంత్‌లు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. విద్యాశాఖాధికారులు అన్నయ్య, జిల్లా రిసోర్స్ సెంటర్ సుబ్బవేలు, కుమరవేల్ గాయత్రి, విజి, పిటిఏ.లక్కప్ప, రమేశ్, పూర్వ విద్యార్థులు సతీస్, తమిళ్‌సెల్వన్, హోమ్ సెర్చ్ ఎడ్యుకేషన్ కమిటీ మంజుళ అజిత్ తో పాటు పలువురు పాల్గొన్నారు.



మేళతాళాలతో ర్యాలీకి శ్రీకారం

మధుమేహ బాధితులకు ఏటా కళ్ల పరీక్షలు

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో సుమారు 10కోట్లమంది మధుమేహంతో బాధపడుతున్నారని 50ఏళ్ల పైబడినవారు ఏటా కళ్ల పరీక్షలు జరిపించుకోవాల్సిన అవసరం ఉందని అగర్వాల్ ఆసుపత్రి నిపుణులు అమోద్‌నాయక్ అభిప్రాయ పడ్డారు. వైట్‌ఫీల్డ్ ఆసుపత్రిలో గురువారం ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ అమోద్‌నాయక్ మాట్లాడుతూ మధుమేహం నిర్ధారణ అయిన తర్వాత ఏటా రెటినోపతి, కంటిపొర, గ్లూకోమా వంటి పరీక్షలు జరిపించుకోవాలన్నారు. మధుమేహం శరీరంలోని వివిధ అవయవాలపై ప్రభావం చూపినట్టే కళ్లపైనా తీవ్రంగా ఉంటుందన్నారు. డయాబెటిక్ మాక్యులర్ ఎడిమా, మధుమేహ రెటినోపతి, విట్రియస్ హెమరైజ్, గ్లూకోమా వంటి సమస్యలను పరీక్షలు చేస్తేనే నిర్ధారణ సాధ్యమవుతుందన్నారు. అగర్వాల్ ఆసుపత్రిలో వరల్డ్ డయాబెటిక్ డేను పురస్కరించుకుని నెలాఖరు దాకా మధుమేహ పరీక్షలకు 50శాతం రాయితీ ఉంటాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.34	1,602.59
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,258	5,645
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,159	8,003
నీటి నిల్వ (టీఎంసీలు)	99.20	25.06

టీబీ డ్యాం సిబ్బందికి వేతన కష్టాలు

● సీ, డీ గ్రూప్ సిబ్బందికి నెలల తరబడి అందని జీతాలు ● కుటుంబ నిర్వహణ భారమవుతోందని ఉద్యోగుల ఆవేదన

బళ్లారి గాంధీనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జలాశయాల ద్వారా సాగునీరు సరఫరాతో రైతులు భూములు సస్యశ్యామలంగా మారుతాయి. సాగునీటిని రైతుల భూములకు చేర్చేందుకు ప్రాజెక్టులు, కాలువ నిర్వహణ తదితర విభాగాల్లో పనిచేసే ఎంతో మంది సిబ్బంది అర్ధాకలితో అమటిస్తున్నారు. నిర్వహణల విభాగంలో పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులు, సిబ్బంది ఆకలి కేకలు మాత్రం తుంగభద్ర జలాశయం బోర్డు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. జీతాలందక బోర్డు పరిధిలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆవేదన అంతా ఇంతా కాదు. ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగుల ఉసురు పోసుకుంటోంది.

కర్నాటక, ఆంధ్ర, తెలంగాణా మూడు రాష్ట్రాల సాగు, తాగునీటి ఉమ్మడి ప్రాజెక్టు నిర్వహణకు ప్రతియేటా గడ్డుకాలం ఏర్పడుతోందనిపిస్తోంది. ప్రాజెక్టు నిర్వహణ మూడు రాష్ట్రాల బాధ్యతగా ఉన్నా... సరైన సమయంలో నిధులు విడుదల కాకపోవడంతో ప్రాజెక్టు నిర్వహణలో పనిచేస్తున్న 150 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 300కు పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులు సరైన సమయంలో వేతనాలు అందక పోగా, 150మంది రిటైర్డ్ ఉద్యోగులకు సరైన సమయంలో పెన్షన్లు కూడా అందడం లేదు. ఈ ఏడాది ఆగస్టు నెలలో 19వ క్రస్ట్ గేట్ కొట్టుకుని పోవడం, అందుకు పలువురు నిపుణులు, కార్మికుల శ్రమతో స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు చేశారు. అయితే అత్యంత శ్రమతో కూడిన స్టాప్‌లాగ్ ఏర్పాటులో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన సిబ్బంది కూడా ఇంతవరకు డబ్బు చెల్లించలేదంటే టీబీ బోర్డు పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. బోర్డు అధికారులు పరిస్థితి మాట ఎలా ఉన్నా సీ, డీ గ్రూపు ఉద్యోగుల వేతనాలు ఆలస్యం కావడం చూస్తుంటే బోర్డు నిధులు లేమితో కొట్టుమిట్టాడుతోందని తెలుస్తోంది.

కాలనీ నిర్వహణలో నిర్లక్ష్యం...

టీబీ బోర్డు పాలనా వ్యవహారాలు ప్రారంభమైనప్పటి నుంచి టీబీ పరిధిలో నిర్మించిన అమరావతి, కమలాపురం ప్రాంతాలో పాటు అధికార, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన కాలనీల నిర్వహణ లేకపోవడంతో ఎటుచూసినా ముళ్లకంపటే దర్శనం ఇస్తూ... కాలనీలో నిర్మించిన ఇల్లు బూత్ బంగ్లాలుగా మారినట్లు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. జలాశయం నిర్మాణ సమయంలో సిబ్బంది, అధికారుల కోసం నిర్మించిన సుమారు 1150పైగా ఇళ్ళు పూర్తిగా దుస్థితికి చేరుకున్నాయి, ఏళ్ళతరబడి నిర్వహణ లేక పాడుబడ్డాయని, ఇళ్ల నివాస యోగ్యానికి లేకుండా పోయానికి సిబ్బంది ఆరోపిస్తున్నారు. కాలనీ వాసులకు అవసరమైన మౌలిక సౌకర్యాలే పోవడంతో దిన నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు జీతాలు లేక మరోవైపు బూత్‌బంగ్లాలుగా మారిన కాలనీ ఇళ్ళలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ళదీస్తున్నట్లు టీబీ బోర్డు కాలనీ వాసులు ఆవేదన.... టీబీ బోర్డు సీ, డీ గ్రూపు ఉద్యోగుల పరిస్థితి రోజు రోజుకు హీనాయ స్థితికి దిగుజారుతోందని, ప్రతినెలా జీతాలు లేకపోవడంతో కుటుంబ నిర్వహణ కష్టతరమవుతోందని టీబీ బోర్డు వర్క్ చార్జ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. గోపాల కృష్ణ, అధ్యక్షుడు శ్రీనివాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయంలో మాత్రం బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే. రెడ్డి మాత్రం డ్యాం ఉద్యోగులకు అవసరమైన వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు నిర్ణీత అవధిలోనే నియమానుసారంగా చెల్లిస్తున్నట్లు, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని కంటితుడుపు మాటలు సర్దిచెపుతున్నారు. తుంగభద్ర జలాశయం బోర్డులో నిధుల్లో ఉంటూ మృతి చెందిన మృతుల కుటుంబాల ఆదుకొనే ఉద్దేశంతో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని నియమాలు ఉన్నా... బోర్డు మాత్రం ఇంతవరకు పట్టించుకోక పోవడంతో 20మంది ఉద్యోగులు కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఉందని బోర్డు ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కృష్ణా వాపోతున్నారు.



టీబీ బోర్డు కార్యాలయం



పిచ్చి మొక్కలతో నిండిన సిబ్బంది క్వార్టర్స్

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో రజనీ లక్కకు రజతం



రజనీని అభినందిస్తున్న క్రీడాధికారి గ్రేసీ

బళ్లారి సిటీ,నవంబరు 14(ఆంధ్ర జ్యోతి): జాతీయ స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్‌లో బళ్లారికి చెందిన రజనీ లక్క రజత పతకాన్ని సాధించింది. నవంబరు 10నుంచి 12 వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 843 మంది పాల్గొన్నారు. రజనీ లక్క బళ్లారి జిల్లాకు ప్రాతినిధ్యం వహించారు. 100మీ బటర్ ఫ్లైలో రజనీ రజత పతకం సాధించారు. 200మీటర్ల విభాగంలో 4వ స్థానం దక్కించుకుంది. సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాపోలీసు సూపరింటెండెంట్ శోభారాణి, జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప, ఏడీసీ మహమ్మద్ జుబేర్, యువజన సాధికారత ఆమెకు అభినందనలు తెలిపారు.

చిరుత సంచారంతో భయం.. భయం

కంప్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చిరుత సంచారం దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. విజయనగర జిల్లా హగరి బొమ్మనహళ్లి పట్టణంలో సమాజ కళ్యాణి కార్యాలయం వద్ద గురువారం 3.30 గంటల సమయంలో చిరుత సంచరించే దృశ్యాలు సీసీ కెమెరాలో కనిపించాయి. స్థానికులు వెంటనే ఈ విషయాన్ని అటవీ అధికారులకు తెలియజేశారు. బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని, తరచూ చిరుతల సంచారంలో భయంభయంగా గడుపుతున్నామని వారు వాపోతున్నారు.

నేలకొరిగిన వరి పంటలు





కంప్లి వద్ద నేలకొరిగిన వరి దరోజీ వద్ద తడిసిన మొక్కజొన్న

కంప్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా తుఫాను ప్రభావం కారణంగా కంప్లి, కురుగోడు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరిపంట నేలకొరిగింది. పంట చేతికొచ్చి కోతలకు సిద్ధమయిన రైతులకు వర్షాలు కొంప ముంచాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మార్కెట్లో కొనుగోలుదారులు లేక వచ్చిన పంటకు ధరలు తగ్గుముఖం పట్టడంతో అన్నదాతకు ఆవేదన తప్పడం లేదు. దరోజీ వద్ద బుధవారం కురిసిన వర్షానికి మొక్కజొన్న కూడా నీటమునిగింది. రైతులు ఉదయాన్నే నీట మునిగిన పంటను రోడ్లపై ఆరబోశారు. వరి కోత ఎకరాకు రూ. 3 వేలు నుంచి 4 వేలు డిమాండ్ పలికినా పొలాల్లో జోరుగా కోతలు ప్రారంభించారు. చేతికొచ్చిన పంటలు నీట మునగడంతో రైతులు తమకు కన్నీరే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మధుమేహ పరీక్షలు తప్పనిసరి: డీహెచ్‌ఓ



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ముప్పైఏళ్ల పైబడినవారు ఆరు నెలలకోసారి మధుమేహ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని డీహెచ్‌ఓ రమేశ్‌బాబు సూచించారు. గురువారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట జిల్లాపాలనాధికారి, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లాసర్వే విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. మధుమేహం వంశపారంపర్యంగా వస్తుందని, ఆహారం సక్రమంగా తీసుకోకపోవడం,అధిక స్థూలకాయం, అధిక బరువు వల్ల మధుమేహం వచ్చే అవకాశం ఉందన్నారు. దాహం, ఆకలి, చూపు మసకబారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. జిల్లా సర్వేయర్ డాక్టర్. మరియంబి మాట్లాడుతూ మధుమేహంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లామానసిక ఆరోగ్య కార్యక్రమం అమలు అధికారి, లెప్రసీ నిర్మూలన అధికారి డా.వీరేంద్రకుమార్, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి అబ్దుల్లా, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాస ప్పనవర్ పాల్గొన్నారు.

సామూహిక వివాహాలను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే జేఎన్ గణేష్, మాజీ మంత్రి ఆంజనేయులు

కంప్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పట్టణాల్లో సంఘ సంస్థలు నిర్వహించే సామూహిక వివాహాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కర్ణాటక రాష్ట్ర దళిత సంఘర్షణ సమితి సంఘటన సంచాలకుడు (కేఆర్‌బీఎస్ఎస్ మానయ్య, మాజీ మంత్రి ఆంజనేయులు, జేఎన్ గణేష్ తెలిపారు. కంప్లి తాలుకా పరిధిలోని రామసాగరం గ్రామంలో గౌరీ పౌర్ణమి సందర్భంగా గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షులు ఆర్ఎం రామయ్య సామూహిక వివాహాలు జరిపారు. ఇందులో 16 జంటలు ఒక్కటయ్యాయి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సీఐ వాసుకుమార్, ఆశా తిప్పేస్వామి, షణ్ముఖ, గంగప్ప, శ్రీకుమార్, మల్లన్న గౌడ, జగదీష్ గౌడ, చంద్రశేఖర్ గౌడ, లోకేష్, సోమేశ్వరి, రామసాగర చంద్రశేఖర్ గౌడ, దళిత సంఘర్షణ సమితి పదాధికారులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆశీర్వదిస్తున్న మాజీమంత్రి ఆంజనేయులు, ఎమ్మెల్యే జేఎన్ గణేష్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

బళ్లారి సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. మైనార్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పన పనులను ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. సుమారు రూ. 5కోట్ల వ్యయంతో వార్డు నెం 6లోని గరీబ్ కాలనీలో రూ. 82,32 లక్షల అంచనా వ్యయంతో ఆయన పనులను ప్రారంభించారు. వార్డునెం 4లోని గుగ్గరహట్టిలో రూ. 95.70లక్షలతో సీసీ రోడ్డు పనులకు, 14వ వార్డులో మిల్లర్‌పేటలో సీసీ రోడ్డు, ముగురు కాల్వపనులు రూ.52.45లక్షల వ్యయంతో ప్రారంభించారు.వార్డునం 9 అంజినప్ప నగర్‌లో రూ. 182,83 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, అంతర్గత డ్రైనేజీ పనులను ప్రారంభించారు. వార్డు నం 15 ఎలాహి వీధిలో రూ. 14.72 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు డి.సూరి, వివేక్, హొన్నప్ప, హగరి గోవింద, ఏపీఎంసీ అధ్యక్షుడు కట్టెమనె నాగేంద్ర, కార్పొరేషన్ సభ్యులు నూర్ మహమ్మద్, జబ్బార్, కవిత హొన్నప్ప, బాలరాజు, హంద్రి రఘురాం పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

25న సీఎం నివాసం ముట్టడి

బళ్లారి సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 25న కర్ణాటక రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించనున్నట్లు మాదిగ దండోరా మాదిగ రిజర్వేషన్, మాదిగ రిజర్వేషన్ పోరాట రాష్ట్ర అధ్యక్షుడు బి.నరస్ప తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సదాశివ కమిషన్ నివేదికను అమలు చేయాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం లేదన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ముఖ్యమంత్రి నివాసం ముట్టడిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు హులుగప్ప, జిల్లా అధ్యక్షుడు నెట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించండి

సిరుగుప్ప, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రొబెషనరీ తహసీల్దార్ సత్యమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మాట్లాడుతూ తాలుకాలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఇంతవరకు ప్రారంభించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనాళ్ మల్లికార్జున స్వామి, డీ ఈరణ్ణ, ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు నాగేశప్ప, రామానాయక్, నాంచారయ్య పాల్గొన్నారు.



ప్రదర్శనను పరిశీలిస్తున్న వీసీ మునిరాజ్

పుస్తక ప్రదర్శన ప్రారంభం

బళ్లారి సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పుస్తక ప్రదర్శనను వీసీ ఎం.మునిరాజు ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరగనుంది. పుస్తకాలు విజ్ఞాన భాండాగారానికి తాళం లాంటివని వీసీ అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించేందుకే ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. బుక్ ఫెయిర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ రుద్రేశ్ అన్నారు. ఈ మేళాలో ఉపాధ్యా సిబ్బందికి, విద్యార్థులకు పరిశోధక విద్యార్థులకు ఉపయోగపడే అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పుస్తక ప్రదర్శనను విజయవంతం చేయాలని చీఫ్ లైబ్రేరియన్, గ్రంథాలయ సమాచార శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ మారన్న పేర్కొన్నారు. నవంబరు 16వరకు జరిగే ఈ మేళాలో రాష్ట్రంలోని 10మందికి పైగా ప్రముఖ పుస్తక విక్రేతలు తమ దుకాణాలను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో వివిధ అంశాలకు సంబంధించిన 15వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈసందర్భంలో విశ్వవిద్యాల సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల పట్ల చిన్నచూపు తగదు



దివ్యాంగురాలికి వీల్‌ఛైర్ అందజేస్తున్న ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రతినిధులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగులను చిన్నచూపు చూడరాదని, కరుణ చూపుతూ వారిలో ప్రోత్సాహం నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ధర్మస్థళ క్షేమాభివృద్ధి సంస్థ ప్రతినిధి వెంకటేష్ పటగార్ పిలుపునిచ్చారు. బళ్లారి తాలూకా పరిధిలోని కొర్లగుంది విభాగం పరిధిలో బసరకోడు గ్రామంలో గురువారం దళవాయి వందరమ్మ అనే మహిళలకు ధర్మస్థళ గ్రామాభివృద్ధి పథకంలో భాగంగా మహిళలకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొర్లగొంది విభాగ పర్యవేక్షకుడు వీరనగౌడ, స్థానిక సేవా ప్రతినిధులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

భళా.. బాలల పండుగ..!

బళ్లారిరూరల్/సిటీ/కంప్లి/రాయచూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని గురువారం పలు కార్యాలయాలు, పాఠశాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు, వక్తలు, నాయకులు చాచా నెహ్రూ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో..



కంప్లి చేతన విద్యానికేతన్ పాఠశాలలో..



వేషధారణలో జిందాల్ ఆదర్శ విద్యార్థులు



రాయచూరులో మాట్లాడుతున్న విద్యావేత్త మురళీధర్ కులకర్ణి



వేషధారణలో అలరిస్తున్న చిన్నారులు



హంపిలో చిందులు వేస్తున్న చిన్నారులు

హోసూరు జోన్

ఘనంగా బాలల దినోత్సవం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల సంక్షేమం ప్రత్యేక సేవల శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ తరపున జాతీయ బాలల దినోత్సవం, బాలలపై అత్యాచారాల నివారణ రోజు, అంతర్జాతీయ దినోత్సవాన్ని గురువారం అర్థవంతంగా ఆచరించారు. కృష్ణగిరి నగరంలోని కొత్త బస్ స్టేషన్‌లో కలెక్టర్ కె.ఎం.సరయు గురువారం ర్యాలీని ప్రారంభించారు. బెంగళూరు రోడ్డు మీదుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ర్యాలీ ముగిసింది. ర్యాలీలో బాలికల హక్కుల పరిరక్షణ, బాలికలపై నేరాలు నియంత్రణకు సంబంధించి అవగాహన బ్యానర్లు చేతపట్టుకుని నినాదాలు చేస్తూ సాగారు. అలాగే ప్రజలకు, ఆటో, బస్సులు డ్రైవర్లు, వ్యాపారులు, కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కృష్ణగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అదియమాన్ కళాబృందం ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెయింట్ జోసెఫ్ పాఠశాల, నర్సింగ్ కళాశాల, విజయ విద్యాలయ నర్సింగ్ కళాశాల, రే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విద్యార్థులు, బాలల అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసు అధికారులు, జిల్లా బాలల సంరక్షణ అధికారి టి.శరవణన్, జిల్లా కమీషనర్ వళర్మతి తదితరులు పాల్గొన్నారు.

రద్దీగా మారిన బాగలూరు రోడ్డు



రద్దీని నియంత్రిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హోసూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని బాగలూరు రోడ్డు అత్యంత రద్దీగా ఉంటుంది. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ మార్గంలో బట్టల దుకాణాలు, షాపింగ్ మాల్స్, ఫ్రూట్స్ స్టాల్స్, ఇతర దుకాణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు రద్దీని తగ్గించేందుకు రోడ్డు పక్కన ఉన్న ఫుట్‌పాత్ దుకాణాలను వీలైనంత వరకు వెనక్కి ఉండేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా తోపుడు బండ్లు ఇతరత్రా ఉంచి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్ఐ సత్య ఆధ్వర్యంలో తోపుడు బండ్లను తొలగించారు.

ఏనుగుల దాడులతో పంటలు నాశనం

హోసూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు శానమావు అటవీ ప్రాంతాల గ్రామాల్లో పంటలపై ఏనుగులు దాడులు చేసి నాశనం చేశాయి. ఏనుగుల సంచారంపై అటవీశాఖ హెచ్చరించింది. హోసూరు సమీపంలోని ఊడేదుర్గం అటవీప్రాంతానికి ఈనెల 12న 20కుపైగా ఏనుగులు వలస వచ్చాయి. సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం బన్నేరుఘట్ట నుంచి ఏనుగులు మరింత వచ్చినట్టు తెలుస్తోంది. డెంకణీకోట ప్రాంతానికి చేరుకున్నాయి. ఆహారం కోసం సంచరిస్తూ స్థానికంగా పండిస్తున్న టమోటా, బీన్సు, క్యాబేజీ, రాగులు తదితర పంటలను ఏనుగులు నాశనం చేశాయి. ఏనుగులు పంటల వైపు రాకుండా నియంత్రించేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఏనుగులు సినిగిరిపల్లి, హనుమంతపురం, డి.కొత్తపల్లి, మీదుగా కొమ్మేపల్లి ప్రాతం చేరుకున్నాయి. అక్కడి వరి పంటను నాశనం చేశాయి. ఈ నేపథ్యంలో పశువులు మేపేందుకు వెళ్లే వారికి, కట్టెలు సేకరించేందుకు వెళ్లేవారికి అటవీశాఖ అధికారులు పలు సూచనలు చేశారు.



దెబ్బతిన్న వరి పంట

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వై ప్రకాశ్

హోసూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు అసెంబ్లీ నియోజకవర్గం హోసూరు పంచాయతీ యూనియన్ పరిధిలో రూ.42.50లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాశ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవగానపల్లి పంచాయతీ సాయి బాబా దేవాలయం మట్టిరోడ్డు, ఆలూరు పంచాయతీ కదిరేపల్లి గ్రామంలో రూ.3 లక్షలు, పేరండపల్లి పంచాయతీ మోరనపల్లి గ్రామంలో నరసింహస్వామి దేవాలయం ఎదురుగా రూ.9 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శులు గజేంద్రమూర్తి, నాగేశ్, ఉపకార్యదర్శి రమేశ్, యూనియన్ కమిటీ సభ్యుడు సంపత్, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షులు వీదభద్రప్ప, ప్రకాశ్, వెంకటేశ్, జిల్లా కళా సాహిత్య వివేచన మండలి అధ్యక్షుడు దేవరాజ్, పంచాయతీ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సంతోశ్, వివిధ శాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.